# అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 169. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.20.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## మాదిగలను ముంచింది కాంగ్రెస్సే..

బంజారా హిల్స్ : అమృత్ తెలంగాణ: అప్పుడు.. ఇప్పుడు.. మాదిగలను ముంచింది కాంగ్రెస్సేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగలకు ఉద్యోగ అవకాశాలు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే గతంలో ఉద్యోగ నోటిఫికేషన్‌లకు వర్గీకరణ అమలు చేస్తామని మోసం చేసిందన్నారు. ఈ కుట్రకు ప్రధాన సూత్రధారులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహనే అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి స్పష్టమవుతోందన్నారు. మాల సామజిక తరగతి నాయకుల ఆధిపత్యానికి తలొగ్గి రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. మాదిగ మంత్రి అని చెప్పుకుంటున్న దామోదర రాజనర్సింహ సొంత మంత్రిత్వ శాఖలోనే ఉన్న వైద్య ఆరోగ్య శాఖలో సుప్రీం కోర్టు తీర్పు ఆగస్టులో వస్తే సెప్టెంబర్‌లో ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధర..రూ.92 వేలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశీయంగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భారీ డిమాండ్ కారణంగా ఇటీవల రూ.90 వేల మార్కు దాటేసిన పసిడి.. తాజాగా రూ.92 వేల మార్కుకు చేరువైంది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన ధర బుధవారం మరో రూ.700 పెరిగి రూ.91,950కి చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. వివాహాల సీజన్ కావడం దేశీయంగా బంగారానికి డిమాండ్ పెరిగినట్లు పేర్కొంది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకు తోడు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో వృద్ధి నెమ్మదించడం కూడా పసిడివైపు పెట్టుబడులు మళ్లేందుకు దోహదం చేస్తున్నాయి. దీంతో అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ పెరిగింది.ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర మంగళవారం రూ.91,250గా ఉండగా.. బుధవారం రూ.700 పెరిగి రూ.91,950కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం కూడా 10 గ్రాములు రూ.91,500 పలుకుతోంది.

## పెద్దల అక్రమ కట్టడాలపై హైడ్రా దృష్టి సారించాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: చెరువులు, నీటివనరులు, ప్రభుత్వ జాగాల రక్షణకు హైడ్రా తీసుకునే చర్యలు పేద, మధ్య తరగతి ప్రజల వరకే పరిమితం కారాదనీ, ధనవంతుల ఆక్రమణలను కూల్చినప్పుడే ఆస్తుల రక్షణ లక్ష్యం దిశగా అడుగులు వేసినట్టవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. చట్టం దృష్టిలో అందరూ సమానమనీ, హైడ్రా ఆచరణలో నిరూపించాలని సూచించింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లో 6.10 ఎకరాల స్థలంపై తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను షామ్స్ ఫాతిమాఖాన్ ఇతరులు హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ భాస్కర్‌రెడ్డి పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్‌బోర్డు భూమి విషయంలో సీఈవో లేఖ ఆధారంగా తహసీల్దార్ నోటీసులు జారీ చేయడం చెల్లదని పిటిషనర్ వాదించారు. ఒక పిల్‌లో హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌కు అనుగుణంగా కూల్చివేత చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్లీడర్ చెప్పారు. సర్వే చేసి అది ప్రభుత్వ భూమి అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనీ, వక్ఫ్‌బోర్డుదని తేలితే ఈ విషయాన్ని బోర్డుకు వదిలేయాలని హైకోర్టు తుది ఉత్తర్వులను జారీ చేసింది.

రేవంత్‌రెడ్డిపై డ్రోన్ కేసు డిస్మిస్

జన్వాడ ఫాంహౌస్ వద్ద పర్మిషన్లు లేకుండా డ్రోన్ ఎగురవేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీగా ఉండగా బీఆర్ఎస్ పాలనలో నార్సింగ్ పోలీసులు పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసింది. డ్రోన్స్ ఎగురవేయకూడదన్న నిషేధిత లిస్ట్‌లో నార్సింగ్‌లోని మియాఖాన్‌గడ్డ లేదని చెప్పింది. కానిస్టేబుల్ జి.వెంకటేశ్ ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసులు 2020లో నమోదు చేసిన కేసును కొట్టివేస్తున్నట్టు జస్టిస్ లక్ష్మణ్ బుధవారం తుది ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యేకు లభించని ముందస్తు బెయిల్

రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో 20 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. జీవన్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌ను కొట్టివేసింది. జీవన్‌రెడ్డి తల్లి రాజుభాయి, భార్య రజితలకు షరతులతో కూడిన ముందస్తు బెయిలు మంజూరు చేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం ఆదేశాలను జారీ చేశారు.

కేటీఆర్‌పై కేసు కొట్టివేత

సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని కించపర్చేలా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సైఫాబాద్ పీఎస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుపై నమోదైన కేసును హైకోర్టు డిస్మిస్ చేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్‌కు కూడా ప్రతిష్ట దెబ్బతిందంటూ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఫిర్యాదుతో సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో గత ఏడాది ఎఫ్ఐఆర్ నమోదైంది. దీన్ని సవాల్ చేస్తూ కేటీఆర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ విచారించి పైవిధంగా ఉత్తర్వులను జారీ చేశారు.

## తెలంగాణ వృద్ధి రేటు భేష్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'తెలంగాణ వృద్ధి రేటు భేష్. జాతీయ సగటుతో పోల్చితే అన్ని రంగాల్లో దూసుకుపోతోంది. 2024లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,46,457 కాగా, 2025లో రూ.3,79,751కి పెరిగింది' అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుదవారం శాసన సభలో ప్రవేశ పెట్టిన తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే-2025 నివేదిక వెల్లడించింది. దేశ తలసరి సగటు ఆదాయం కన్నా .8 శాతం అధికంగా ఉందని పేర్కొంది. గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ ప్రస్తుత ధరల ప్రకారం 16,12,751 గా ఉందని వెల్లడించింది. ఇది దేశీయ సగటుతో పోల్చితే .2 శాతం అదికమని పేర్కొంది. అప్పులను ఆదాయాన్ని సమన్వయం చేసుకుంటూ గణనీమైన వృద్ధిని రాష్ట్రం నమోదు చేస్తోందని తెలిపింది. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ కఠినమైన నిర్ణయాలు తీసుకోని దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించింది. వ్యవసాయం, తయారీ, సమాచార సాంకేతిక, ఫార్మా మొదలగు రంగాలు తెలంగాణ ప్రధాన ఆర్థిక వనరులుగా ఉన్నాయని తెలిపింది. ఈ రంగాల్లో భారీగా పెట్టుబడులను ఆకర్షించి ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించింది. సంక్షేమ పథకాలను సవాలుగా తీసుకుని అమలు చేస్తున్నామనీ, ఈ పథకాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. విద్య, వైద్యం, పరిశ్రమలు, మహిళాభివృద్ధికి అధిక నిధులు వెచ్చిస్తున్నామనీ, ఫలితంగా ఈ రంగాల్లో గణనీయమైన వృద్ధి రేట్ నమోదైందని నివేదికలో పేర్కొంది. గతంలో పోలిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందని సామాజిక ఆర్థిక సర్వే-2025 గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్థిరమైన,

పారదర్శకమైన పాలనను అందిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. గత ప్రభుత్వ తప్పిదాలను సవరించుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రణాళికాబద్దంగా ముందుకు వెలుతున్నట్టు నివేదికలో సర్కార్ తెలిపింది.

## పచ్చి అబద్ధాలు, అసత్యాలు, అతిశయోక్తులు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అబద్ధాలు, అసత్యాల, అతిశయోక్తులతో కూడుకుని ఉన్నదని ఆర్థికశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. భట్టి బడ్జెట్ బడా జూటా బడ్జెట్ అనీ, ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ పార్టీ తన విశ్వసనీయతను కోల్పోయిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ లోపల, బయట అబద్ధాలే ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు వడ్డీ లేని రుణం ఇస్తున్నామనీ బయట చెప్పి, అసెంబ్లీలో రూ.5 లక్షల వరకే వడ్డీ లేని రుణమని చెబుతున్నారన్నారు. దీంతో రూ.15 లక్షలకు మహిళలే వడ్డీలు కడుతున్నారని చెప్పారు. మొత్తం డబ్బుకు వడ్డీ లేని రుణం ఇస్తే ప్రభుత్వం చెప్పేది నిజమవుతుందని సూచించారు. స్కూల్ విద్యార్థుల డ్రెస్ కుట్టు ఛార్జీలు రూ.75కు పెంచామనీ చెప్పారే కానీ ఇస్తున్నది రూ.50 మాత్రమేనని తెలిపారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చినట్టు తెలిపారు. అందాలపోటీల కోసం రూ.2,500 కోట్లు కేటాయించి, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, చేయూత కింద పింఛన్ రూ.4,000 మరిచారని విమర్శించారు. లక్షా 50 వేల పింఛన్లు తగ్గించి కోత పెట్టారని తెలిపారు. రూ.2 లక్షలలోపు ఉన్న, ఎక్కువ ఉన్న వారికి రుణమాఫీ కాలేదంటూ, తన నియోజకవర్గంలో 10,500 మందికి రుణమాఫీ కాలేదన్నారు. తులం బంగారం, రైతు రుణమాఫీ చేయలేదనీ, ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. బడ్జెట్ అవాస్తవికంగా ఉందని తెలిపారు.


జీఎస్డీపీ గ్రోత్ రేటు 12.9 శాతం నుంచి కాంగ్రెస్ పాలనలో 10.1 శాతానికి అంటే 2.8 శాతం ఎందుకు తగ్గిందని హరీశ్ రావు ప్రశ్నించారు. తలసరి ఆదాయం బీఆర్ఎస్ పాలనలో 12.4శాతముంటే కాంగ్రెస్ పాలనలో 9.6 శాతానికి పడిపోయిందని తెలిపారు. గతేడాది 5888 కోట్ల రెవెన్యూ మిగిలి ఉంటే, ఈ బడ్జెట్‌లో 2738 కోట్ల సర్ ప్లస్ ఉంటదని ప్రతిపాదించారని చెప్పారు. సర్ ప్లస్ గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చిత్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఎక్సైజ్ ద్వారా 50వేల కోట్ల రాబడి ఆశిస్తూ, తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల అమ్మకం విపరీతంగా పెంచుతున్నారనీ, తమ హయాంలో రూ.23వేల కోట్ల నాన్ టాక్స్ రెవెన్యూ ఉంటే కాంగ్రెస్ రూ.32, 618 కోట్లు పెట్టారని తెలిపారు. మైనార్టీస్ కోసం గతంలో రూ.3 వేల కోట్లు అని చెప్పి రూ.ఒక వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. బీసీలకు రూ.20 వేల కోట్లు ఏవి అని ప్రశ్నించారు. సబ్ ప్లాన్ ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. సీఎస్ఎస్ ద్వారా కేంద్రం నుంచి రూ.15,729 కోట్లు వస్తాయని బడ్జెట్ లో పేర్కొన్నారనీ, 2023-24 లో వచ్చింది 5,966 కోట్లు మాత్రమేనని గుర్తుచేశారు. కేంద్రం 1.34 శాతమే ఇస్తే 2.9శాతం అని పెట్టారని విమర్శించారు. కేంద్రం నరేగా కోసం గతేడాది, ఈ ఏడాది కూడా రూ.86 వేల కోట్ల చొప్పున పెడితే గతేడాది రూ.2,600 కోట్లు, ఈ ఏడాది రూ.3 వేల కోట్లు వస్తాయని బడ్జెట్‌లో ఎలా పెట్టారని ప్రశ్నించారు. మిడ్ డే మీల్స్ కోసం గతేడాది రూ.145 కోట్లు వస్తే, ఈసారి రూ.1200 కోట్లు, మహిళలకు సంబంధించి రూ.9.90 కోట్లు వస్తే, ఈ సారి రూ.1,949 కోట్లు ఎలా వస్తాయో సమాధానం చెప్పాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణం కోస గతేడాది బడ్జెట్‌లో రూ.22,500 కోట్లు పెట్టి 22 పైసలు ఖర్చు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కోటి మంది కూలీలుంటారనీ, ఆ కూలీలకు రూ.12 వేలు చొప్పున ఇవ్వాలంటే ఎంత కావాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు కేవలం రూ.600 కోట్లు మాత్రమే కేటాయించారని తప్పుపట్టారు. బడ్జెట్ అంకెల గారడీ, అబద్ధాల గారడీ అని విమర్శించారు.

## బడ్జెట్‌లో పర్యాటకానికి రూ.775 కోట్లు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్లో రూ.775 కోట్లు కేటాయించింది. తెలంగాణ పర్యాటక పాలసీ లక్ష్యాలను బడ్జెట్లో ఆవిష్కరించింది. జీఎస్‌డీపీలో పర్యాటక రంగం వాటాను 10 శాతానికి పెంచడం, రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 3 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా నిర్ణయించారు. రాబోయే ఐదేండ్ల కాలం (2030 నాటికి) 10 కోట్ల దేశీయ పర్యాటకులతో పాటు 5 లక్షల అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడంతో పాటు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రీజనల్ రింగ్ రోడ్ సమీపంలో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా నదులపై జెట్టీలు, లాంచి స్టేషన్లు, వాటర్ స్పోర్ట్స్, హౌస్ బోట్లు, నదీ ఉత్సవాలను ప్రోత్సహిస్తూ, పెట్టుబడులకు మూలధన సబ్సిడీలు, భూమి వినియోగ మార్పిడికి సంబంధించిన రాయితీలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రత్యేక కేటాయింపులు కాకుండా ప్రయివేట్ పెట్టుబడులు సమీకరించడం ద్వారా ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సర్కార్ ఉంది. ఈ విధానం వల్ల భవిష్యత్‌లో పర్యాటకం తెలంగాణలో ఖరీదుగా మారే అవకాశం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

## వచ్చే వానాకాలం, యాసంగి సీజన్లకు 'రైతు భరోసా'



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన వానాకాలం సీజన్‌కు రైతుభరోసాను విస్మరించింది. యాసంగి సీజన్‌లో ప్రారంభించినా ఇప్పటివరకు మూడెకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ చేసింది. మిగితా రైతులకు యాసంగి ముగుస్తున్నా రైతు భరోసా పూర్తవ్వలేదు. కానీ 2025-26 వార్షిక బడ్జెట్‌లో మాత్రం రూ.18వేల కోట్లు కేటాయించి రైతులకు గూడ్‌న్యూస్ చెప్పింది. రైతులకు వచ్చే ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనుంది. ఇవీ కాకుండా వ్యవసాయానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ 24,439 కోట్లు కేటాయించింది. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయరంగానికి కేవలం రూ.19,746 కోట్లు మాత్రమే నిధులు కేటాయించింది. గతేడాదిలో పోల్చితే ఈసారి రూ.4,693 కోట్లు మాత్రమే అదనంగా కేటాయించింది. అయితే ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ కింద రూ.20,616.89 కోట్లను 25.35 లక్షల మంది రైతులకు చెల్లించింది. పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసినా వివిధ కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు ఈ బడ్జెట్ నిరాశే మిగిల్చింది. ఆ రైతుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. రైతులకు విత్తనాల సరఫరా, ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి, రైతువేదికల నిర్వాహణ, మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్, వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలకు, మైక్రో ఇరిగేషన్ తదితరాలకు కూడా నిధులు కేటాయించింది. గతేడాది పశువర్ధక శాఖ జీరో నిధులు కేటాయించిన సర్కారు ఈసారి రూ.1,674 కేటాయించింది. అందులో ప్రధానంగా వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ నిర్మాణం కోసం రూ. 300 కోట్లు కేటాయించింది. దీంతో పశువులు వ్యాధుల బారిన పడకుండా నిరోధించే టీకాలను ఉత్పత్తి చేస్తుంది. కొహెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం రూ. 47 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నిధులను కేటాయించలేదు. మరోవైపు కూరగాయల సాగు రైతులను ప్రోత్సహిస్తామంటూ చెబుతున్న సర్కారు.. ఆ శాఖను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టలేదు.

పామాయిల్ సాగును లక్షల ఎకరాలకు విస్తరించాలనే లక్ష్యానికి అనుగుణంగా కేటాయింపులు లేవు. కేవలం గతంలో ఇస్తున్న సబ్సిడీని కొనసాగిస్తామని పేర్కొంది. ఇప్పటికే పామాయిల్ గెలలకు సరైన ధర అందడం లేదంటున్న రైతులకు బడ్జెట్ నిరాశను కలిగిస్తున్నది. దిగుమతి సుంకాన్ని ఎత్తేసేందుకు కృషి చేస్తామని చెప్పింది. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే ఆ రైతులకు భరోసా కల్గించేలా బడ్జెట్ లేదు. అకాల వర్షాలకు ప్రతియేటా కొన్ని లక్షల ఎకరాల్లో పంట నష్టం జరుగుతున్నది. ఆ బాధల నుంచి రైతులను గట్టెక్కించేందుకు సర్కారు చర్యలు చేపట్టలేదు. పంటల బీమా అందకపోవడంతో రైతులు ఇప్పటికీ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

## భట్టి బడ్జెట్ అంతా డొల్ల..బోగస్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: శాసనసభలో మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా డొల్ల , బోగస్ అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బడ్జెట్ రూపకల్పన చేయడమే తెలియదన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. రెవెన్యూలోటు ఉన్న రాష్ట్రంలో రెవెన్యూ మిగులు చూపెట్టడమేంటని ప్రశ్నించారు. రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చి పూడ్చే ప్రయత్నం చేస్తున్నదని గుర్తుచేశారు. ఏపీ బడ్జెట్‌ను గమనిస్తే రూ.33 వేల కోట్ల లోటు చూపించారని గుర్తుచేశారు. 17 రాష్ట్రాల్లో రెవెన్యూ లోటును పూడ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రెవెన్యూ లోటును ఒప్పుకోవడం లేదనీ, దీనివల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఆదాయం కోసం ప్రభుత్వ ఆస్తులను తెగనమ్ముకునే ప్రయత్నం చేస్తుంది తప్పితే మరే ప్రత్యామ్నాయం ఆలోచన చేయడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అవసరాలకు బదులుగా, కమీషన్ల కోసం ఖర్చు చేసే విధంగా బడ్జెట్ రూపొందించిందని ఆరోపించారు. ఐదేండ్లలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఖర్చుపెడతామని చెప్పి ఇప్పుడు బడ్జెట్‌లో కేవలం రూ.11,405 కోట్లు ప్రతిపాదించడమేంటని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణను రాజకీయంగా ఉపయోగించుకోవడం మాత్రమే రేవంత్‌రెడ్డికి తెలుసునని దెప్పిపొడిచారు. నిరుద్యోగ యువతను నిట్టనిలువునా కాంగ్రెస్ ప్రభుత్వం ముంచిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి కోసం నిధులు ఎందుకు కేటాయించలేదు? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారుకు ఇదే చివరి బడ్జెట్ అవుతుందేమోనని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సంవత్సర కాలంలోనే నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.....

## బిసి రిజర్వేషన్లను 42% అమలుచేసి భారత దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర. మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ ....



హామీలు నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞత తెలుపుతూ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు



కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు కుబీర్ లో అంబేద్కర్ చిత్రపటానికి పూలదండ వేసి సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు



నర్సాపూర్ జి మండలంలోని చాక్పల్లి లో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

నిర్మల్ జిల్లా బైంసా మార్చ్ 19 అమృత్ తెలంగాణ బైంసా పట్టణంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఆదేశానుసారం మన మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బైంసా పట్టణ మార్కెట్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎలక్షన్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిన్న అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడం ఎంతో హర్షనీయమని వెనుకబడిన తరగతుల కోసం కృషి చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు మరియు గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత కరెంటును అందిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా యువకుల కోసం రాజీవ్ యువ వికాస్ పథకంలో ప్రారంభించి సుమారు 5 లక్షల మందిని ఎంపిక చేసి వారికి 6000 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే నిరుద్యోగుల కోసం సుమారు 55 వేల ఉ ద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి అని బైంసా పట్టణ కేంద్ర కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు, పార్టీ ఏఎంసి వైస్ చైర్మన్ ఎండీ ఫారుక్ అహ్మద్, గంగాధర్ పటిల్,రాజేశ్వర్, భోజరం, రమేష్, జయరాం, భగవాన్, సతీష్, శివనాథ్,సాయినాథ్ గారు ఉన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్,...

## మహేష్ చదువుకు 15,000 రూపాయల చెక్కు పాఠశాల సిబ్బందికి అందజేత....

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 19 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలం అంజని తాండ గ్రామానికి చెందిన రాథోడ్ మహేష్ (08) గత ఆరు సంవత్సరాల క్రితం తల్లిదండ్రులు కోల్పోయి అనాధలుగా మారారు. ఇట్టి విషయం అంజని తాండ గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్, వెంటనే స్పందించి రాథోడ్ మహేష్ యొక్క స్థితిగతులను తెలుసుకొని.రాథోడ్ మహేష్ ని దత్తత తీసుకుంటానని మాట ఇచ్చారు.అతనిని 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకు కావలసిన బాధ్యత సమత ఫౌండేషన్ తీసుకుంటుందని ఒప్పుకున్నారు.ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ చేతుల మీదుగా 1వ తరగతికి సంబంధించిన ఫీజు 15000/ చెక్ రూపం లో ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సమత ఫౌండేషన్ సీఈవో అనిల్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు యోగేష్,సాయి కృష్ణ,ముత్యం, సాజిద్,సుధాకర్,రాజు, తదితరులు పాల్గొన్నారు




సెయింట్ థామస్ పాఠశాల ఉపాధ్యాయులకు 15000 ల చెక్కును అందజేస్తున్న సమత ఫౌండేషన్ చైర్మన్ సమతా సుదర్శన్,

# పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లా పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 నుండి ఏప్రియల్ 4 వరకు సెక్షన్ 163 BNSS యాక్ట్ –2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల,ఐపీఎస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9129 విద్యార్థులకు 47 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగాపరీక్షా కేంద్రాల వద్ద ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సెక్షన్ 163 BNSS అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# తెలంగాణ స్పీకర్ కు గడ్డం ప్రసాద్ మరియు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లివినతి పత్రం

## గోండు గోవారిలను ఎస్టీల చేర్చాలని వినతి



తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ వినతి పత్రం ఇస్తున్న దృశ్యం



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ఎమ్మెల్యే పాయల్ శంకర్ మరియు ఉష్కం రఘుపతి వినతి పత్రం అందజేత దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న గోండు గోవారిలు తెలంగాణ రాష్ట్రంలో ఏ కులంలోనూ చేర్చకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తమను ఎస్టి సామాజిక వర్గంలో చేర్చాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన గుండు గోవారిల సంఘ ప్రతినిధులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు తమ కులాన్ని జాబితాలో చేర్చకపోవడంతో తమ పిల్లలు చదువుకోలేకపోతున్నారని ఆయనకు వివరించారు అనంతరం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సైతం కలిసి వారు వినతిపత్రం ఇచ్చారు విషయంపై తాము చర్చించి సరైన న్యాయం చేయకురేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఉష్కం రఘుపతి తదితరులు పాల్గొన్నారు

# అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

ఇంద్రవెల్లి, ఉట్నూర్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ

కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని దర్శించిన జిల్లా ఎస్పీ.

ప్రజలతో, ఆదివాసీలతో మమేకమై విధులను నిర్వర్తించాలి.

పోలీస్ స్టేషన్ రికార్డులను, సిబ్బంది విధులను పరిశీలించిన జిల్లా ఎస్పీ.





అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి ఉట్నూర్ పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా మొదటగా ఇరువురి పోలీస్ స్టేషన్ల అధికారులు జిల్లా ఎస్పీకి పూల మొక్క అందజేసి స్వాగతం పలికి, సిబ్బంది ని పరిచయం చేశారు. తదుపరి ఇరు పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న చిల్డ్రన్ పార్కులను పోలీసు కుటుంబ సభ్యులు పిల్లలు వినియోగించుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో భారీగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నమోదు కాకుండా చూడాలన్నారు. ప్రజలకు విరివిగా సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్య పరచాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల రోడ్డు ప్రమాదాలను నివారించడానికి యువతకు కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్డుపై తీసుకునే జాగ్రత్తలను వివరించాలని, ప్రతిరోజు సాయంత్రం సమయంలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. గంజాయి పండించడం, సేవించడం, కలిగి ఉండడం, వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరమని, అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఆదివాసీలతో ప్రతిరోజు మమేకమైతు గ్రామాలను సందర్శిస్తూ విధులను నిర్వర్తించాలని సూచించారు. తదుపరి ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా ఆలయాన్ని సందర్శించి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. మేస్రం వంశీయుల ఆచారాలను, ఆలయ చరిత్రను, ఆలయ పరిసరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

పోలీస్ స్టేషన్లో ఉన్న అనవసర వాహనాలను చట్ట ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్, ఉట్నూర్ సిఐ జి మొగిలి, ఎస్సైలు డి సునీల్, మనోహర్, పి ఎస్ ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ దత్తత తీసుకున్న బుర్కి గ్రామాన్ని సందర్శించి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామస్తులకు దుప్పట్లు, విద్యార్థులకు యూనిఫాం లను అందజేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా, ఐటిడిప ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా.

అదిలాబాద్ రూరల్ బుర్కి గ్రామాన్ని బుధవారం జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓ సందర్శించారు.

ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన వాహనం లో బుర్కి గ్రామానికి చేరుకున్నారు.

గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఈ కార్యక్రమం లో ట్రైబల్ వెల్ఫేర్ EE , DWO, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, ఫారెస్ట్, rws, వ్యవసాయ శాఖ AO, వివిధ ఆయా శాఖల అధికారులు, ఎంపిడిఒ, mpo, తదితరులు గ్రామం లో చేపట్టిన అభివృద్ధి పనుల తీరును కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని మౌలిక వసతులు, అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, ఈ గ్రామం లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుందని, అంగన్వాడి భవనం, కమ్యూనిటీ హాల్ నూతనంగా నిర్మించడం జరిగిందన్నారు. రహదారి నిర్మాణానికి అంకోలీ నుండి భుర్కి గ్రామానికి 6 కిలో మీటర్లు ఉంటుందని, రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ముందుగా రెవెన్యు కు సంబంధించి 1.6 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణం, తదుపరి అటవీ శాఖ అనుమతుల తో మిగితా. రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ నిర్మాణ పనులు మార్చి చివరి లోగా పూర్తి చేయాలనీ ee ట్రైబల్ వెల్ఫేర్ ను ఆదేశించారు. ఓపెన్ వెల్ కు రిటర్నింగ్ వాల్ ఏప్రిల్ 7th వరకు పూర్తి చేయడ్లను rws ను ఆదేశించారు. అలాగే సోలార్ ద్వార నీటి సదుపాయం కల్పించడానికి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రెడ్ సి సంస్థ ముందుకు వచ్చిందని అన్నారు. ఐటిడిఏ ద్వారా 20 మందికి డీజిల్ ఇంజన్, స్ప్రింకర్లు, ట్రాక్టర్, క్రషర్ ఏర్పాటు చేయడం జరుగుతుందనీ ఐటిడిఎ పిఓ తెలిపారు. అంగన్వాడి ద్వారా పోషకాహారం అందించడం జరుగుతున్నదని, అంగన్వాడి టీచర్, crt తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని తెలిపారు. మారుమూల గిరిజనులు నివాసమైన బుర్కి గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకొని ప్రణాళిక ప్రకారం

గిరిజనులకు పోషకమైన ఆహారాన్ని అందించడానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (IRCS) సభ్యులు పనిచేస్తున్నారని, వీరి ఆద్వర్యం లో దుప్పట్లు, యూనిఫాం గ్రామస్తులకు, విద్యార్థులకు కలెక్టర్, ఐటిడిఎ పీవో చేతుల మీదుగా అందించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు శాతాన్ని, పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద సోనేరావు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి: సీపీఐ(ఎం)

జన్నారం అమృత్ తెలంగాణ: జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో ఉన్న ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొండ గొర్ల లింగన్న అన్నారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లెల సర్వేలో భాగంగా కవ్వాల్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో చాలామందికి అర్హత ఉన్నప్పటికీ పెన్షన్లు రావడం లేదన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గ్రామంలో పోటు



చేసుకుని సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలి ఇవ్వాలన్నారు. గ్రామంలో అత్యధిక మంది పెన్షన్లకు అర్హత ఉన్న వారికి పెన్షన్లు రావడం లేదన్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి వెంటనే అర్హత ఉన్న వారందరినీ గుర్తించి పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబటి లక్ష్మణ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు...

పిల్లలను ఉద్దేశించి మాట్లాడిన ఎంఈఓ విజయ్ కుమార్.




నిఘ్వ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

నిర్మల్ జిల్లా నిఘ్వ మార్చ్ 19 అమృత్ తెలంగాణ నిఘ్వ జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ఎంఈఓ విజయ్ కుమార్, మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని 100% ఉత్తీర్ణత సాధించాలని అదేవిధంగా పాఠశాలకు మరియు గ్రామానికి తల్లిదండ్రులకు పేరు వచ్చే విధంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో కుబీర్ మండలంలో నిగ్వా స్కూల్ ను మొదటి స్థానంలో ఉంచాలని కోరడం జరిగింది కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించా

(A.I.S.B)విద్యార్థి సంఘా రాష్ట్ర నాయకులు (లాస్టూడెంట్ ) రాహుల్ జేవారే



రాహుల్ జే వారే

అమృత్ తెలంగాణ నిర్మల్ బ్యూరో : ఉమ్మడి అదిలాబాద్ టెన్త్ పరీక్షలు పకడ్బందీగా మాల్ ప్రాక్టీస్ కు తవివ్వకుండా చర్యలు చేపట్టి పరీక్షలు నిర్వహించాలనిలి (A.I.S.B) ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ రాహుల్ జేవారే ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21 తేది నుంచి జరగబోయే టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని విద్యార్థులకు వారి పరీక్ష కేంద్రాలలో తగిన మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు.పరీక్ష కేంద్రాలలో వేసవి కాలం దృష్ట్యా మంచి నీళ్ల సౌకర్యం కల్పించాలని వారు అన్నారు.ప్రతి తరగతి గదిలో ఫ్యాన్స్ ఉండే విదంగా చూడాలని వారు పేర్కొన్నారు.పరీక్ష సమయాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి పరీక్ష కేంద్రలో ఏలాంటి అవంతరాలు జరగకుండా చూడాలని వారు ఉమ్మడి జిల్లా విద్య అధికారులకు కోరారు...

# 22న సైన్స్ కళాశాలలో యువజన ఉత్సవ పోటీలు




ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ లో మార్చ్ 22న జిల్లాస్థాయి యువజన ఉత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.సంగీత, నెహ్రూ యువజన కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ సుశీల్ బడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చ్ 22న నిర్వహించే జిల్లా యువజన ఉత్సవ పోటీలలో 15-29 మధ్య వయసు గల డిగ్రీ చదివినా లేదా చదువుతున్న యువతీ యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ (వ్యక్తిగత మరియు బృంద క్యాటగిరి), పెయింటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ, కవితా రచన, ఉపన్యాస పోటీ, సంస్కృతిక నృత్య విభాగం (వ్యక్తిగత బృందా కేటగిరి), పోటీలో గెలుపొందిన వ్యక్తిగత బృందా క్యాటగిరీలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు నగదు రూపంలో అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు కళాశాల లో సంప్రదించాలని సూచించారు.

# హక్కులను వినియోగించు కోవాలి ఎల్చర్ వార్ సత్యనారాయణ




కేక్ కట్ చేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక యాదవ సంఘ భవనం లో (ఏ.సి.ఎఫ్ ) యాక్టివ్ కన్స్యూమర్ ఫోరం జిల్లా దృకులు ఏల్చుల్ వార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్లో జరుగుతున్న మోసాలకు చెక్ పెట్టాలంటే ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు . మార్కెట్లో నిత్యవసర సరుకులు దగ్గరనుంచి ప్రతి వస్తువు కల్తీ మాయమయ్యాయి అని వస్తువులూ కొనే ముందు వాటి నాణ్యత ప్రమాణాలు చూసుకోవాలని ఎమ్మార్పీ ధరలకే వస్తువులను కొనుగోలు చేయాలని అన్నారు . ఏవైనా సమస్యలుంటే వినియోగదారుల కమిషన్ను ఆశ్రయించి నష్టపరిహారాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. వినియోగదారులు ఉచిత న్యాయ సలహాలు పొందడానికి 8919442501 కు ఫోన్ చేసి న్యాయ సలహాలు పొందవచ్చని తెలిపారు . ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ దుర్గం సుభాష్ , లీగల్ అడ్వైజర్ నారాయణ యాదవ్ అద్వకేట్, విశ్వనాథ్ అద్వకేట్, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయిలో అవార్డుకు ఎంపికైన ఉట్నూర్ డిగ్రీ కళాశాల



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా లోని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిజ్ఞాస ప్రాజెక్ట్ కు రాష్ట్ర స్థాయి అవార్డు రావడము అభినందనీయమని ఉట్నూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టాగ్రే ప్రతాప్ సింగ్ అన్నారు గిరిజన అంశం పైన తోటిలు వారి స్థితి గతులపైన ప్రదర్శన చేశార్ ప్రభుత్వ కళాశాల లో విద్యార్థులు చేరాలని మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ అన్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు

# 10 వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ అమలు - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

52 సెంటర్లలో 10106 పరీక్షలు రాయనున్న విద్యార్థినీ విద్యార్థులు.
పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో
గుంపులు గుంపులుగా తిరగడానికి అనుమతి లేదు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జరిగే పదవ తరగతి పరీక్షల ఈనెల 21వ తారీకు నుండి ఏప్రిల్ నాలుగవ తారీకు వరకు 52 సెంటర్లలో 10106 విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. ఈ సందర్భంగా పోలీసు ముఖ్య కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ఒక ప్రకటన విడుదల చేస్తూ, పరీక్ష కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్ ( 144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. కావున పరీక్షా కేంద్రాల 200 మీటర్ల వరకు ఎవరు గుమికూడి ఉండకుండా ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులకు, డీజేలతో, ఊరేగింపులకు, ధర్నాలకు, ప్రచారాలకు అనుమతులు లేవని తెలియజేశారు. పరీక్ష సమయంలో పరిసర ప్రాంతాలలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ దుకాణాలను మూసివేసి ఉంచాలని తెలిపారు. పట్టణంలో విద్యార్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది ద్వారా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ప్రశ్న పత్రాలు అందజేయ క్రమంలో సరైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష పూర్తి అయి, తిరిగి జవాబు పత్రాలు వెళ్లే వరకు బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పట్టణంలో మరియు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ద్వారా నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీసు పెట్రోలింగ్ పార్టీలు గస్తీ నిర్వహిస్తూ ఉంటాయని, లేనిచో డయల్ 100 ను వినియోగించుకోవాలని సూచించారు.

# పట్టణాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సమర్ధవంతంగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైనా నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. మున్సిపాలిటీల వారిగా కేటాయించిన నిధులు, చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులు, అందుబాటులో ఉన్న నిధులకు సంబంధించిన వివరాలను ఆయా అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత వానాకాలం వరదల వల్ల నష్టపోయిన మౌలిక సదుపాయాలకు మరమ్మత్తుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయాలు, తదితర భవంతుల విద్యుత్ బిల్లులు సమయానికి చెల్లించాలన్నారు. అధికారులంతా ఆదాయ సృష్టిపై దృష్టి సాధించాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని పార్కులన్నింటిని అభివృద్ధి చేయాలన్నారు. సుందరీకరణ పనులను చేపట్టి ప్రజలను పార్కులకు వచ్చే విధంగా ఆకర్షించాలన్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపొందించలన్నారు. గేట్లు, గోడలకు పెయింటింగ్ వేసి, మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ వాసులను భాగస్వామ్యం చేస్తూ, పార్కులకు అసోసియేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించి వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్, ఖానాపూర్, బైంసా మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ రావడంపై అభినందనలు తెలియజేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ లభించిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. జిల్లాలోని సారంగాపూర్ మండలం చించోలి.బి, లక్ష్మణచందా మండలం మల్లాపూర్, ముధోల్ మండలం తరోడ, బాసర మండలంలోని కౌట నాలుగు ఆరోగ్య కేంద్రాలకు ఈ జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు లభించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి బృందం అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, పలు నాణ్యత ప్రమాణాలను బేరీజువేసి ఉత్తమ నాణ్యత ప్రమాణాలు గల ఆరోగ్య కేంద్రాలుగా గుర్తింపును ఇచ్చినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు తమ పనితీరు కనబరిచి భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహకాలు, అవార్డులు అందుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# జిల్లా కేంద్రంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పట్టణంలోని శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) లో మున్సిపల్ అధికారులు బుధవారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ప్రజలకు కలెక్టర్ మంచినీటిని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో బస్టాండ్, ప్రధాన కూడళ్ళు, మార్కెట్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలంతా చలివేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్నాయని, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, అర్బన్ తహసిల్దార్ రాజు, మున్సిపల్ డిఈ హరిభువన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జన్నారంలో మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి



జన్నారం :అమృత్ తెలంగాణ: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి కార్యక్రమం జన్నారం మండల కేంద్రం సుందరయ్య నగర్ లో సిపిఐఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కనికారం అశోక్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం స్వరాజ్యం చేసిన పోరాటం ఎనలేనిది అన్నారు. స్వరాజ్యం ఆశయాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం జన్నారం మండల కమిటీ సభ్యులు మగ్గిడి జయ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు వైద్య సిబ్బంది ముందుండాలని అన్నారు.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు వైద్య సిబ్బంది ముందుండాలని అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం రిమ్స్ డైరెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల ప్రొఫెసర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్ ఆస్పత్రికి వచ్చే వారందరూ పేద ప్రజలేనని పేదలను దృష్టిలో ఉంచుకొని వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా గైనకాలజీ డిపార్ట్మెంట్లో అన్ని రకాల డెలివరీస్ చేయాలని రిఫరల్ లేకుండా చూడాలని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులకు డెలివరీ నిమిత్తం వెళ్తున్నారని డెలివరీ కొరకు ప్రభుత్వ ఆసుపత్రి ,రిమ్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరం ఉన్న మహిళలకు టుబెక్టమి చేయడంలో ముందుండాలని తెలిపారు.

అన్ని శాఖల ప్రొఫెసర్ల ను వారి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రిలో పేషెంట్లు ను చూసుకునేందుకు పేషెంట్ కేర్లు ఉన్నారని రోగులకు ఎలాంటి అవసరాలు ఉన్న పేషంట్ కేర్ ద్వారానే చేయించాలని తెలిపారు. ఎక్స్రే ఈసీజీ స్కానింగ్ రక్త పరీక్షలు తోపాటు అన్ని రకాల పరీక్షలకు సంబంధించి ప్రొఫెసర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నర్సింగ్ కళాశాలలో ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయి ఏ ఏ పోస్టు ఖాళీల ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు ప్రిన్సిపాల్ సమాధానం ఇస్తూ ఇటీవల ఈ ఏడాది ఎంఎస్సీ నర్సింగ్ కొరకు అప్లై చేశామని తెలిపారు 8 మంది స్థాఫ్ నర్సులను టీచింగ్ ఫ్యాకల్టీ కోసం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆర్ ఎం ఓ లు ఎంతమంది ఉన్నారు ఏమేం పని చేస్తున్నారు విధులు బాధ్యతలు ఏంటి అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ నీ ప్రభుత్వం ఐదు లక్షల నుంచి పది లక్షల పెంచిందని ఆరోగ్యశ్రీలో పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్, ఆస్పత్రి సూపరిండెంట్లు డాక్టర్ అశోక్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# ఓటు నమోదు పై విస్తృత ప్రచారం చేయాలి

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ఓటు నమోదు పై విస్తృత ప్రచారం చేయాలని,రాజకీయ పార్టీలు బూత్ ఏజెంట్ లను నియమించాలని స్థానిక తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ రాజకీయ నాయకులకు సూచించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయము లో బుధవారం 118- అశ్వారావుపేట (యస్.టి.) నియోజక వర్గం రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులతో తహశీల్దార్,సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి వి కృష్ణ ప్రసాద్, మరియు తహశీల్దారు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో (18) సంవత్సరములు వయస్సు నిండి ఓటు లేని వారిని ఓటు నమోదు చేసుకునేలా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించమని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేసినారు. అదేవిధంగా మరణించిన వారు డబల్ గా నమోదైన వారి పేర్లను గుర్తించినట్లు అయితే ఫారం - 7 ద్వారా బూత్ స్థాయి అధికారులతో విచారణ చేపించి తగు చర్యలు తీసుకోబడునని తెలియజేసినాడు.ఏమైనా సవరణలు ఉన్నచో పారం %-% 8 ద్వారా దరఖాస్తు చేసుకోవలసి నది తెలిపినారు. అదేవిధంగా రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులతో నియోజక వర్గం లో గల 184 పోలింగ్ బూత్ లకు సంబంధించి బూత్ స్థాయిలో బీఎల్ఏ (బూత్ స్థాయి ఏజెంట్ లను నియమించి అట్టి జాబితాను రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయంలో సమర్పించమని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నాయబ్ తహశీల్దార్ యస్ డి హుస్సేన్,నాయబ్ తహశీల్దార్



సీ హెచ్ వి. రామకృష్ణ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిదులైన మడకం ప్రసాద్,తుమ్మ రాంబాబు, బుడితి చిరంజీవి,నార్లపాటి శ్రీనివాసరావు, గన్నిన రామకృష్ణ,సత్యవరపు సంపూర్ణ,బండారు చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం లో భాగంగా అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు 400000/- వరకు ఆర్థిక సహాయం అందిస్తోందని, దీనిలో కనీసం 60 % - 80% సబ్సిడీ కూడా అందిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం తెలిపారు.

దరఖాస్తు కు కావాల్సినవి

1. ఆధార్
2. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి (అన్ని కులాల వారికి )
3. పాన్ కార్డు
4. Passport ఫోటో
5. లబ్ధిదారుడి ఫోన్ నంబర్

ముఖ్య సూచన : ఒక రేషన్ కార్డులోని సభ్యులలో ఒకరికి మాత్రమే అవకాశం కలదు..

ఉపాధి అంశాలు :

ఏ.వ్యవసాయ అంశాలు

1.ఎద్దుల బండ్లు
2.ఆయిల్ ఇంజిన్
3.పంప్ సెట్
4.ఎయిర్ కంప్రెషర్
5.పత్తి సేకరణ యంత్రం
6.వేరుషనగ మిషన్
7.వర్మీ కంపోస్ట్
8. ఆయిల్ ఫామ్ పంట

ఏ.పశుపోషణ

1. గేదెలు
2. ఆవులు
3. డైరీ ఫారం
4. కోడిగుడ్ల వ్యాపారం
5. చేపల వ్యాపారం
6. మేకల పెంపకం
7. పాల వ్యాపారం
8. పౌల్ట్రీ ఫారం
9. గొర్రెల పెంపకం

ఏ. సొంత వ్యాపారం

1. ఎయిర్ కూలర్ల వ్యాపారం
2. స్టీల్ సామాన్ల వ్యాపారం
3. ఆటోమొబైల్ షాపు
4. బేకరీ షాపు
5. గాజుల దుకాణం
6. హెయిర్ కటింగ్ షాపు
7. బట్టల తయారీ షాపు
8. బ్యూటీ పార్లర్ షాపు
9. జనరల్ స్టోర్
10. ఇటుకలు తయారీ వ్యాపారం
11. డిష్ టీవీ ల ఏర్పాటు
12. వడ్రంగి షాపు
13. సీసీ కెమెరాల రిపేర్ షాప్
14. ఎలక్ట్రిక్ షాపు
15. ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కేంద్రం వైరింగ్ కేంద్రం
16. మగ్గం టైలరింగ్
17. చెప్పులు అమ్మే దుకాణం
18. పండ్ల వ్యాపార కేంద్రం
19. పండ్ల రసాల దుకాణం
20. బట్టల దుకాణం
21. కిరాణం జనరల్ స్టోర్
22. జనరేటర్ షాప్
23. గిఫ్ట్ ఆర్టికల్ షాప్
24. బంగారు నగల దుకాణం
25. పిండి గిర్ని కేంద్రం
26. హెూటల్ ఏర్పాటు
27. ఐస్ క్రీమ్ పార్లర్ ఏర్పాటు
28. ఐరన్ బిజినెస్
29. లేడీస్ కార్నర్
30. లాండ్రీ షాపు డ్రై క్లీనింగ్
31. పేపర్ ప్లేట్ల తయారీ
32. లైట్స్ డెకరేషన్ సౌండ్ సిస్టం
33. అగరబత్తుల తయారీ
34. మినీ సూపర్ బజార్
35. మెడికల్ అండ్ జనరల్ స్టోర్
36. ఆటో టిఫిన్ సెంటర్
37. మోటార్ మెకానిక్
38. మోటార్ అండ్ పైప్ లైన్
39. మటన్ షాపు
40. పాన్ షాపు
41. పేపర్ బ్యాగుల తయారీ
42. ఫోటో అండ్ వీడియో షాపు
43. పిండి గిర్ని
44. ఫిల్టర్ వాటర్ కేంద్రం
45. రెడిమేడ్ బట్టల దుకాణం
46. చీరల వ్యాపారం
47. స్లాబ్ కటింగ్ మిషన్
48. స్ప్రే పెయింటింగ్ మిషన్
49. స్టీల్ అండ్ సిమెంట్
50. స్టిచింగ్ మిషన్
51. సప్లయర్స్ షాపు
52. మిఠాయిల షాపు
53. టైలరింగ్
54. వెల్డింగ్ షాపు
55. వాటర్ సర్వీసింగ్ సెంటర్
56. కూరగాయల వ్యాపార షాపు
57. టిఫిన్ అండ్ టీ షాప్
58. టీవీ మెకానిక్ షాప్
59. సెల్ ఫోన్ రిపేర్ షాప్
60. సిమెంటు ఐరన్ షాపు
61. సెంట్రింగ్ పరికరాల షాపు
62. చెప్పుల తయారీ షాపు
63. చికెన్ సెంటర్
64. బట్టల వ్యాపారం
65. కాఫీ హెూటల్
66. కాంక్రీట్ మిల్లర్స్ పరికరాలు
67. కూల్ డ్రింక్ షాప్
68. క్రేన్
69. కర్రీస్ పాయింట్
70. సైకిల్ మెకానిక్
71. వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు
72. డీజిల్ ఆటో
73. డిజిటల్ కెమెరా షాపు
74. సెటప్ బాక్స్ ల ఏర్పాటు

# సీతకి వయసు తో వచ్చిన కష్టాలు పాపం..!



సీతారామం సినిమా తో తెలుగు లో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. హిందీలో ఈమె సినిమాల్లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది.. అంతకు ముందే సీరియల్స్ లో కూడా ఈ అమ్మడు చాలానే పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం దక్కిన స్టార్ డమ్.. సూపర్ హిట్ మాత్రం ఆమెకు ఇన్నాళ్ల సినీ కెరీర్ లో దక్కలేదనే చెప్పాలి. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో సీత పాత్రకు అచ్చు గుద్దినట్లుగా అద్భుతంగా సెట్ అవ్వడంతో ప్రతి ఒక్కరు కూడా ఫిదా అయ్యారు.. ఇంకా కూడా అవుతూనే ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుసగా సినీ ఆఫర్లు దక్కించుకుంటున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ఒక పాత్ర కోసం వేశ్య గృహంలో ఉండాల్సి వచ్చిందని చెప్పిన మృణాల్ ఠాకూర్ కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు గురించి పలు ఆసక్తికర విషయాలను చెప్పింది. ఇదే సమయంలో ఆమె తన వయసు గురించి కాస్త అసహనంతో మాట్లాడింది. నా వయసు ప్రస్తావన వచ్చిన ప్రతి సారి కూడా చాలా మంది పెళ్లి గురించి అడుగుతూ ఉంటారని.. ప్రేమ లో పడలేదా అంటూ ఆశ్చర్యంగా ఫేస్ పెడతారు అంటూ మృణాల్ పేర్కొంది. నా వయసు 30 ఏళ్లు అంటూ చెప్పగానే మీరు పెళ్లి చేసుకోవాల్సిన సమయం వచ్చినట్లుంది.. పెళ్లి పై మీ యొక్క అభిప్రాయం అంటూ చాలా మంది ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. ఎన్నో సార్లు సమాధానం చెప్పినా కూడా ప్రేమ గురించి నన్ను ఎప్పుడూ ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రేమ గురించి నాకంటూ ఒక అవగాహణ ఉందని మృణాల్ పేర్కొంది.

# వెబ్ సిరీస్ లో ఊర్మిళ దుమారం తప్పదా?



బాలీవుడ్ బ్యూటీ ఊర్మిళ మండోత్కర్ నాలుగేళ్లగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అవకాశాలు రాక...సరైసనన పాత్రలు దొరకక గ్యాప్ ఇచ్చిందా? అన్నది క్లారిటీ లేదు గానీ..ఊర్మిళ తెరపై ఎప్పుడు కనిపించినా ఓ సంచలనమే అన్నది వాస్తవం. యాభైకి చేరువలోనూ ఊర్మిళ ధగధగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వెండి తెరపై మెరిసిన అమ్మడు బుల్లి తెరపైనా తనదైన మార్క్ వేసింది. పలు రియాల్టీ షోలను హెూస్ట్ చేసి ఐడెంటీ వేసింది. ప్రస్తుతం డిడ్ సూపర్ మామ్స్ సీజన్ -3రని హెూస్ట చేస్తోంది. తాజాగా ఊర్మిళ వెబ్ సిరీస్ లకు సై అనేసింది. 'తివారీ' అనే వెబ్ సిరీస్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుంది. తల్లి -కుమార్తె నేపథ్యంలో సాగే స్టోరీ కావడంతో ఆ రెండు పాత్రలు కూడా ఆమె పోషిస్తుందిట. పాత్రలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటుందిట. గత ఆరు నెలలుగా అదే పనిలో బిజీగా ఉ న్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పాత్రల గురించి స్పందించింది. ' నాలోని నటికి తివారీ సవాల్ విసురుతుంది. ఇందులో అనుబంధాలే కాదు.. ఊహించని మలుపు యాక్షన్ సన్నివేశాలు..రొమాంటిక్ సీన్లు ఉంటాయని' రివీల్ చేసింది. మొత్తానికి ఊర్మిళ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ గట్టిగానే ఊపేటట్లు కనిపిస్తుంది. స్టార్ హీరోయిన్ గా కొనసాగినంత కాలం బాలీవుడ్ ని ఓ ఊపు ఊపేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదు. ఈ క్రమంలో కొంత గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఓటీటీని షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం వెబ్ సిరీస్ ల్లోకి స్టార్ హీరోయిన్లు సైతం ఎంట్రీ ఇస్తున్నారు. ఈక్రమంలో అక్కడా పోటీ వాతావరణం కనిపిస్తుంది. ఒకరికొకరు పోటీ పడుతూ సత్తా చాటుతున్నారు. వెండి తెరను మించి ఓటీటీ బోల్డ్ కంటెంట్ లో విచ్చలవిడిగా నటించడానికి ఎలాంటి అడ్డంకులు పెట్టడం లేదు. ఛాన్స్ ఇవ్వాలే గానీ.. దర్శకుడి సృతజాన్మతకని మించి పెర్ఫార్మెన్స్ ఇస్తున్నారు. మరి ఆ రకంగా ఊర్మిళ కూడా రేసులో నిలుస్తుందా? అన్నది చూడాలి. ఊర్మిళ తెలుగులోనూ అంతే ఫేమస్. ఆమె 'అంతం'..'గాయం'..'అనగనగా ఒక రోజు' లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

# మంచి ఆఫర్లు రాబడుతున్న 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'



'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా అక్టోబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియా సర్కిల్స్ లో మంచి సంచలనం సృష్టించింది. చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి మేకర్స్ తమ ప్రయత్నాలను రెట్టింపు చేస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన క్రేజీ ట్రైలర్ మరియు ప్రమోషనల్ సాంగ్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇది బయ్యర్ల నుండి మంచి ఆఫర్లు రావడానికి దోహదపడినట్లు సమాచారం. 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' చుట్టూ నెలకొన్న హైప్ దృష్ట్యా ఈ సినిమా ఆంధ్ర నైజాం మరియు సీడెడ్ ఏరియాలకు బయ్యర్లు సుమారు 3 కోట్ల కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యునిక్ కాన్సెప్ట్.. ప్రత్యేకమైన కథనం ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సినిమా ప్రీ క్లైమాక్స్ పార్ట్ ఎప్పుడూ చూడని ఎమోషన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అంటున్నారు. అలాగే సంగీతం సినిమాటోగ్రఫీ మరియు క్రిస్పీ ఎడిటింగ్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా మంచి బిజినెస్ డీల్ తో ముగించే అవకాశం ఉందని అనుకోవచ్చు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో విశ్వంత్ - మాళవిక సతీషన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ మరియు స్వస్తిక సినిమా బ్యానర్స్ పై నిరంజన్ రెడ్డి - వేణు మాధవ్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



ఈశాన్యామహేశ్వరి హాట్ ఇన్ రెడ్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com